# నేరము - శిక్ష

రచన :
శ్రీ చందా రవీందర్.

రైట్ ! అన్న కండక్టరు అరుపు విన్న డ్రైవర్ ఇంజను స్టార్ట్ చేయగా మెల్లగా ధ్వని చేసుకుంటూ బయలుదేరింది. బస్సు నల్లని రోడుమీద త్రాచుపాములా సాగిపోతుంది. సాయంత్రము ఏడు గంటల సమయము అది. చినుకులు పడుతున్నాయి బయట. నీళ్ళు పడకుండా కర్టెన్లు వాల్చిన బస్సులో, డబ్బాలో నింపిన బియ్యంలా ఉన్నారు జనం. ఎవరి మాటలు వారివి. ఒకరు పత్రికలు చదువుతుంటే, ఇంకొకరు లోకాభి రామాయణం మాట్లాడుతున్నారు.

బస్సులో, ఒక ప్రక్క సీటులో కూర్చున్న ఒక యువకునికి, అదే ప్రక్క వరుసలో ఉన్న అమ్మాయి అందం తప్ప వేరే ఏం అగపడడం లేదు. అసలు అతను బస్సులో ప్రయాణము చేస్తున్నట్లు ధ్యాసకూడ ఉందో లేదో? తను ఇంకా టిక్కట్టు తీసుకోలేదనే ఆలోచన అసలు జ్ఞాపకము లేదు. ముందుగా సీటుపై కర్చీఫ్ వేసి కండక్టరు ఇష్యూ చేస్తుండగా, కండక్టరు వెనకనుంచి వెళ్ళి సీటుపై కూర్చున్నాడు. అతనికి బస్సులో ఏం జరుగుతున్నది తెలియడం లేదు. ఆ అమ్మాయి ప్రతి కదలికను గమనిస్తు, ఆలోచిస్తు కూర్చున్నాడు. మరో ప్రక్క నూతన దంపతులు కాబోలు ఏదో మాట్లాడుకుంటూ మధ్యమధ్య నవ్వుతున్నారు. ప్రతి కుదుపుకు ఒకరిమీద ఇంకొకరు పడుతున్నారు. ఈసారి యువకుని దృష్టి ఇటు వెళ్ళింది! 'సిగ్గైనా లేదు ఇంతమందిలో ఏమిటి వీళ్ళ సరసాలు' అనుకున్నాడు తనలోతాను.

ప్రక్కనుంచి కండక్టరు సార్ ఎవరైనా ఇంకా టికెటు తీసుకోనివాళ్ళుంటే తీసుకోండి. ముందు చెకింగ్ ఉంది. ఎవరైనా తప్పితే తీసుకోండి అనుకుంటూ వస్తున్నాడు. ఈ వానలో ఎవడొస్తాడోయి చెకింగ్ అన్నాడొక బెల్ బాటమ్ పైంట్ తొడుక్కున్నాతను. ఇవ్వన్ని మాటలు అప్రయత్నింగానే విన్న ఈ యువకునికి నేను టికెట్టు తీసుకోలేదని స్మరణకు వచ్చింది. కాని, కండక్టరు అడగందే నేనే అడిగి టికెట్టు ఎందుకు తీసుకోవాలి అనుకున్నాడు. ఇప్పుడు నేనే ఇమ్మన్నా ఏం మీరు ఎందుకు తీసుకోలేదు సార్ అంటాడు. నేనడిగినందుకు నన్నే అంటున్నావా అని దబాయించవచ్చు. కాని ఇదంతా ఎందుకొచ్చిన గొడవ. చెకింగ్ వస్తే నన్నడగలేదు, నాదేం తప్పు అంటాను, అనుకొని ఊరుకున్నాడు. ఇంకా ఎవరైనా తీసుకోవాలా సార్! అంటూ ఒకసారి పూర్తి చుట్టూచూసి 'ఎస్సార్' నింపసాగాడు.

ఏదో స్టేజి వస్తే ఆగింది బస్సు. యువకుడు టికెట్టు తీసుకుందామా! అనుకున్నాడు. కాని వచ్చే స్టేజిలో అయితే దిగెయ్యొచ్చు. దీనికి వీడికి నలభై పయిసలు ఎందుకివ్వాలి అనుకున్నాడు.

దిగేవారు దిగాక, ఎక్కేవారు ఎక్కాక బస్సు కదిలింది. బస్సు ఓ మలుపు అవుతున్న సమయములో బస్సును చెకింగు ఇన్స్పెక్టర్లు ఆపి బస్సులో చొరబడ్డారు. కండక్టరు దగ్గర వున్న అతని టికెట్టు ప్యాడ్, ఎస్సార్ తీసుకొని తనిఖీ చేయసాగారు ఒకరు. ప్రయాణికులవద్ద

టికెట్టు అడిగి చూసుకుంటూ వెళుతున్నారొకరు. ఇదంతా గమనిస్తున్న మన కథానాయకుడు ఇన్‌స్పెక్టరుకు ఏం సమాధానం చెప్పాలో మననము చేసుకుంటూ యున్నాడు. ఇన్‌స్పెక్టరు (టి.టి.ఐ.) యువకునివద్దకు రాగానే తను అనుకున్నట్లుగానే, కండక్టరు నన్ను టికెట్టు తీసుకొమ్మని అడగలేదు, నేను తీసుకోలేదు సార్, అతనికొరకుకూడ చూశాను కాని ఈ జనంలో అతను కన్పించలేదు అని చెప్పాడు.

చెకింగు పూర్తయి రిపోర్టు వ్రాస్తుండగా కండక్టరు ఎంతగానో చెప్పాడు. తను అతనికి టికెట్టు ఇవ్వంది దురుద్దేశముతో కాదని కాని ఆ ఆఫీసర్ కండక్టరు మాట విన్పించుకోకుండా ఏదో వ్రాసివెళ్ళాడు.

★ ★ ★

వారం రోజుల తర్వాత ఓ ఇంటర్వ్యూకు వెళ్ళిన ఈ యువకునికి, ఆ ఆఫీసులోగ ఇంటర్వ్యూకివచ్చిన ఓఅభ్యర్థి తనకా ఉద్యోగము ఎలాగైనాసరె ఇవ్వమని ప్రాధేయపడుతున్న మాటలు వినవచ్చాయి. ఆ అభ్యర్థి, సార్ నాకీ ఉద్యోగం ఇప్పించండి సార్, ముసలి తల్లి, రోగిష్ట భార్య, పెళ్ళి చేయాల్సిన చెల్లెలు వీరంత నా ఉద్యోగంమీద ఆధరపడి వున్నారు నాకీ ఉద్యోగం ఇవ్వకపోతే అందరము పస్తులుండి చావల్సివస్తుంది సార్ అంటూ ఎంతో వేడుకుంటూన్నాడు. ఆ అధికారి, అధికారయుతంగానేసరేకాని బయటికి వెళ్ళు అంటున్నాడు. చెమటలు తుడుచుకుంటూ బయటకు వచ్చిన ఆ వ్యక్తిని చూచిన ఈ యువకుడు క్షణంసేపు నిర్ఘాంతపోయాడు. అతను ఆరోజు బస్సులో బట్టుబడిన కండక్టరు. ఔను. తనమూలంగానే పట్టుబడిన కండక్టరు, అతనికి లీలగా జరిగింది అర్థమైంది. నా నలబై పయిసలకొరకు, ఎదుటి నల్గురు జీవితాలకు ఎన్ని కష్టాలు తెచ్చాను అని బాధపడుతూ, పశ్చాత్తాపపడుతూ, ఆ ఇంటర్వ్యూకు వెళ్ళకుండా, ఆతన్ని క్షమించమని అడుగుటకు మాజి కండక్టరు వెనక నడవసాగాడు.

# : సంఘర్షణ :

* రచన : శ్రీ తుమ్మల దాదారెడ్డి *

"ఎటురా ఆనంద్ ?" "కాలేజికి"

ఈమధ్య రెగులర్గా అటెండ్ ఔతున్నావ్ !'

"అంటే ఇంతకుముందు ఎగవేశానా ?" "కాదనుకో, అన్నట్టు మరచాను పెళ్ళిచూపులకు వెళ్ళావటగా !"

"నీకెవరు చెప్పార్రా! మొత్తంపై నీవసాధ్యుడివిరా"

"పిల్ల నచ్చిందా! ఏమి చదువుతుంది ?" "ఏ నిర్ణయానికీ రాలేకపోతున్నాను. ఇంటర్ చదివింది"

లిప్తకాలం నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోనే మనసులో గతం నృత్యం చేసింది.

★ ★ ★

"ఒరేయ్ ఆనంద్ ! నీకు పిల్లనిస్తామని వచ్చారురా !"

"నా పెళ్ళికి తొందరేమొచ్చింది ?"

"తొందరేం కావాలిరా ? నీ ఈడొచ్చేసరికి నీవు నాకు పుట్టావు" "మీకాలం సంగతి వేరు! నేనిపుడు చేసుకోను."

"నీకేమి పిచ్చిపట్టిందా' అమ్మాయి చదువుకుంది. ముప్పయి వేలు ఇస్తారట. అమ్మాయి తండ్రి ఓడిపోయిన శాసన సభ్యుడు. ఉద్యోగంకూడా యిప్పిస్తారట. అన్నివిధాలా అనువైన సంబంధం కాదనకురా !"

"ఏమో !" అని తప్పించుకున్నాను.

"ఏరా! బాగా ఆలోచిస్తున్నావ్" అన్న రవి మాటలో నేను ఈ లోకంలోకి వచ్చాను.

ఏంలేదురా రవీ! మనసేం బాగుండటం లేదు.